


వారపు సంతలో తనిఖీలు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:మండలంలోని కించుమండలో బుధవారం జరిగిన వారపు సంతలో లీగల్ మెట్రాలజీ అధికారులు తనిఖీలను నిర్వహించారు. లీగల్ మెట్రాలజీ (గాజువాక) ఆధ్వర్యాన తూనికలు, కొలతల సహాయ నియంత్రికులు తనిఖీలను నిర్వహించారు. ఆ శాఖ జిల్లా పరిశీలకులు అనురాధ, గాజువాక లీగల్ మెట్రాలజీ అధికారి రమేష్‌లు మోస పూరితంగా గిరిజనుల వద్ద పంటలను కొనుగోలు చేస్తున్న వ్యాపారులపై కేసులను నమోదు చేశారు. శీతల పానీయాలను అధిక ధరలకు అమ్ముతున్న ఒక దుకాణంపై కేసు నమోదు చేశారు. ముద్ర లేకుండా వినియోగిస్తున్న నాలుగు కాటాలపై కేసులు నమోదు చేయడం జరిగిందని వారు చెప్పారు.



కాటాను పరిశీలిస్తున్న అధికారులు

'ఉపాధి హామీ'కి కేంద్రం తూట్లు

సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స

ప్రజాశక్తి-జిమాడుగుల: ఉపాధి హామీ చట్టాన్ని సాధారణ సంక్షేమ పథకంగా మార్చేందుకు, వ్యవసాయ కూలీలకు ఉపాధిని గ్యారంటీ లేకుండా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా నీరుగార్చేందుకు కుట్ర పన్నుతుందని, దీన్ని ప్రతిఘటించాలని సిపిఎం అల్లూరి సీతారామరాజు జిల్లా కార్యదర్శి పి. అప్పల నర్స పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 2005లో వామపక్ష ఉద్యమాల ఒత్తిడితో తీసుకొచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రం సాధారణ సంక్షేమ పథకంగా మార్చే ప్రయత్నాలు చేస్తోందని, దీన్ని సి.పి.ఎం. జిల్లా కమిటీ ఇప్పటికే ఖండించిందని ఆయన తెలిపారు. నేటి వ్యవసాయ సంక్షోభంలో కనీసం 200 పనిదినాలు కల్పించాలని, రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని డిమాండు చేశారు. కేంద్ర క్యాబినెట్ ఆమోదించిన సవరణ బిల్లు కేవలం పేరు మార్చడానికి మాత్రమే కాదు, "పూజ్య బాపు గ్రామీణ రోజ్‌గార్ యోజన" పేరుతో చేసిన సవరణలు ప్రమాదకరమైనవని వివరించారు. ముఖ్యంగా ఆదివాసీ ప్రాంతాల్లో ఈ చట్టం అమలు లోపాలను ఎత్తిచూపుతూ, అల్లూరి జిల్లాలోని ఆదివాసీలు, పేద వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న అన్యాయాలను వివరించారు. "మహాత్మాగాంధీ పేరును ఉద్దేశపూర్వకంగా తొలగించడమే కాకుండా, ఈ చట్టాన్ని పథకంగా మార్చడంతో గ్రామీణ పేదలకు హక్కుగా ఉన్న ఉపాధి రద్దవుతుందన్నారు. ఈ పథకం అనేది ప్రభుత్వ దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉంటుందన్నారు. కానీ చట్టంగా ఉంటే హక్కును కల్పిస్తుందన్నారు. ఆదివాసీ ప్రాంతాల్లో వ్యవసాయం, అటవీ ఉత్పత్తులపై ఆధారపడిన పేదలకు ఈ చట్టం జీవనాధారమని తెలిపారు. మోడీ ప్రభుత్వం భూస్వాములు, పెత్తందార్ల ఒత్తిళ్లకు తలొగ్గి దీన్ని నీరుగార్చుతోందని విమర్శించారు. జాతీయ స్థాయిలో కుటుంబానికి 100 పనిదినాలు గ్యారంటీ ఉండగా, నిజానికి సగటున 50 రోజులు కూడా కల్పించలేదన్నారు. ఆంధ్రాలో కొంత మెరుగ్గా ఉన్నప్పటికీ, బీహార్ వంటి రాష్ట్రాల్లో 35 రోజులు కూడా లేవని పేర్కొన్నారు. ఆదివాసీలకు పని



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

కల్పించాల్సిన రోజులకు నిరుద్యోగ భృతి ఇవ్వకపోవడం, చట్టాన్ని అమలు చేయకపోవడంతో వలసలు పెరుగుతున్నాయన్నారు. వ్యవసాయ వేతనాలు స్థిరీకరణకు ఈ చట్టం తోడ్పడుతుందని వివరించారు. ముఖ్యంగా ఆదివాసీ మహిళలు, యువత ఈ చట్టంతో లబ్ధి పొందుతున్నారని, సవరణలతో ఇది ఎత్తివేయడానికి కుట్రలు జరుగుతున్నాయని విమర్శించారు.100 రోజులను 125 రోజులకు పెంచుతున్నట్లు చెప్పి మోసం చేస్తుందన్నారు.పట్టణాలకు కూడా ఈ పథకాన్ని విస్తరించాలని వామపక్షాలు డిమాండు చేస్తుండగా, దీన్ని లేకుండా చేయడం సరికాదన్నారు.ఆదివాసీ ప్రజలు, పేదలు, వ్యవసాయ కూలీలు, మధ్యతరగతి రైతులు, పట్టణ శ్రామికులు అందరూ ఈ కుట్రలను ప్రతిఘటించి చట్టాన్ని కాపాడుకోవాలని పి. అప్పల నరస విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు వి.దాస్, మండల కమిటీ కార్యదర్శి ఎస్. ధర్మన్న పడాల్, జిల్లా నాయకులు ఎస్.చిట్టి బాబు, మండల కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



నగదు బహుమతిని ఇస్తున్న ఉపాధ్యాయులు


ప్రజాశక్తి-హుకుంపేట:ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాశాఖ, భారతీయ విజ్ఞాన మండలి, సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సంయుక్తంగా నిర్వహించిన కౌశల్-2025 సైన్స్ క్విజ్, పోస్టర్ ప్రెజెంటేషన్ పోటీలలో హుకుంపేట మండలంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల (బాలికలు), ఉప్పకు చెందిన విద్యార్థినులు విజయం సాధించారు. ఈ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న పి. ఈశ్వరమ్మ, సిహెచ్. మేఘనలు అల్లూరి సీతారామరాజు జిల్లా తరపున రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం విశేషం. ఈ నెల 27వ తేదీన తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో జరిగే రాష్ట్ర స్థాయి కౌశల్ సైన్స్ పోటీలకు వారు హాజరుకానున్నారు. జిల్లా స్థాయి విజేతల బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో అల్లూరి జిల్లా సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ డాక్టర్ స్వామినాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో విజేతలకు నగదు బహుమతులు, మెమొంటోలులను జిల్లా కౌశల్ కోఆర్డినేటర్ పి. రమణమూర్తి నాయుడు, ఏఏఎస్ఓ రామారావుల సమక్షంలో అందజేశారు. రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక కావడంలో కీలక పాత్ర పోషించిన ఉప్ప గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.బి.వి. మూర్తి, సైన్స్ ఉపాధ్యాయురాలు బి. జ్ఞానవతితో పాటు పాఠశాల ఉపాధ్యాయ సిబ్బందిని ప్రశంసించారు.

డి.శారదకు ఘన నివాళి

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:అరకులోయలోని శారదా నికేతన్ స్కూల్‌లో బుధవారం కామ్రేడ్ డి శారద 21వ వర్ధంతి సందర్భంగా వర్ధంతి సభను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.చిరంజీవులు, ఉపాధ్యాయులు కామ్రేడ్ శారద చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎస్ చిరంజీవులు మాట్లాడుతూ, డి. శారద శ్రామిక మహిళల సమస్యలపై అనేక ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించారని గుర్తు చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజనులకు విద్య, వైద్యం, తాగునీరు వంటి మౌలిక సదుపాయాల కోసం ఆమె నిరంతరం సేవలు మరువలేనివని అన్నారు. విశాఖనగరంలోని స్టీల్ ప్లాంట్, హెచ్‌పీసీఎల్, బీహెచ్ఈఎల్, పోర్ట్, డాక్ యార్డ్ వంటి ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే కార్మికుల సమస్యల పరిష్కారానికి శారద చేసిన కృషి చిరస్మరణీయమని తెలిపారు. ఆమె ఆశయాలను కొనసాగించాలనే లక్ష్యంతోనే గిరిజన ప్రాంతంలో నాణ్యమైన విద్య అందించేందుకు శారద నికేతన్ స్కూల్‌ను స్థాపించారని వివరించారు. కామ్రేడ్ శారద ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



అరకులోయలో పూలమాల వేస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు



ముంచంగిపుట్టులో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

ముంచింగిపుట్టు: మండల కేంద్రంలోని శారద నికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల లో బుధవారం పాఠశాల ప్రిన్సిపల్ సిహెచ్ మత్స్యరాజు, పాఠశాల చిన్నారులు శారద చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ప్రిన్సిపాల్ సిహెచ్ మత్స్య రాజు మాట్లాడుతూ, శారద ఆశయాల సాధన కోసం మనం కృషి చేయాలనీ కోరారు.ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది ఎస్.దోన్ను, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:అల్లూరి సీతారామ రాజు జిల్లా పాడేరు ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులు ఎదుర్కొంటున్న తీవ్ర చలిని దృష్టిలో ఉంచుకుని అల్లూరి వాకర్స్ అసోసియేషన్ (సీతమ్మధార) సహకారంతో ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం దుప్పట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అరకువేలి మండలం బస్కి పంచాయతీ పరిధిలోని దేవరపల్లి, దుంగ్యపుట్, జాకరవలస గ్రామాల్లో ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, మండల నాయకులు కె.రామారావు, బి. దశరథ్ అధ్యక్షతన దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతాల్లో డిసెంబర్ నెలలో ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీల వరకు పడిపోవడంతో గిరిజనులు, ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు తెలిపారు. గిరిజనులకు ప్రభుత్వం ఉచితంగా దుప్పట్లు అందించాలని వారు డిమాండ్ చేశారు.సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులు, విద్యార్థినులు చలిదుప్పట్లు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో అల్లూరి వాకర్స్ అసోసియేషన్ సహకారంతో సుమారు రూ.50 వేల విలువైన 400 చలిదుప్పట్లు పంపిణీ చేయగా, గిరిజన సంఘం నాయకులు అసోసియేషన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ నాయకులు కె.మాణిక్యం, కె. రవిశంకర్, పి.బలరాం, ఎస్.నర్సింగరావు, కె. చిరంజీవి పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఆదివాసి గిరిజన సంఘం నేతలు సురేంద్ర,రామారావు



విడివికెను ప్రారంభిస్తున్న నాయకులు, ఎపిఎం

మహిళలకు ఆర్థిక భరోసా

ప్రజాశక్తి -హుకుంపేట:మండలంలోని తీగలవలస పంచాయతీలో ఏర్పాటు చేసిన వందన్ వికాస్ కేంద్రం (వీడీవీకే)ను స్థానిక సర్పంచులు, ఎంపీటీసీలు, ఏపీఎం అప్పాయమ్మతో కలిసి బుధవారం ప్రారంభించారు. గన్నేరు పుట్టు పంచాయతీ డొంకినవలస గ్రామంలో నూతనంగా నిర్మించిన వందన్ వికాస్ కేంద్రాన్ని హుకుంపేట మండల పరిషత్ వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు, గన్నేరు పుట్టు సర్పంచ్ సోకేలి కష్టారావు, వెలుగు సీసీ బాలరాజులతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు మాట్లాడుతూ, వీడీవీకే కేంద్రాలు మహిళలకు ఆర్థిక భరోసా కల్పించే ప్రధాన సాధనంగా మారుతున్నాయన్నారు. రైతులు పండించే అటవీ ఉత్పత్తులను వీడీవీకేల ద్వారా కొనుగోలు చేసి, వాటికి విలువ జోడించి అధిక ధరకు విక్రయించడం ద్వారా లాభాలు పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తామర్ల సుబ్బారావు, సీసీ ఆర్. దేవినాయుడు, పీసా ఉపాధ్యక్షులు మజ్జి చిట్టిబాబు, ప్రకతి వ్యవసాయ అధికారి రామకృష్ణ, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ పాంగి జోగన్న, కాంట్రాక్టర్ జంగిడి వెంకటరావు, వీఓఏలు జయసుధ, భవాని, రమణ, పోతురాజు, డ్వాక్రా ఎస్ఎస్‌జీ మహిళలు మజ్జి పద్మకుమారి, సూర్యకాంతం, లక్ష్మి, కాసులమ్మ, జ్యోతి పాల్గొన్నారు.

ఆరోగ్యకేంద్రంలో..

మందులు అందుబాటులో ఉండాలి

ఐటిడిఎ పిఒ స్మరణ్‌రాజ్

మారేడుమిల్లి పిహెచ్‌సి, దేవరపల్లి ఆశ్రమ పాఠశాల, రబ్బర్‌ప్లాంటేషన్ పరిశీలన



దేవరపల్లి ఆశ్రమపాఠశాలలో విద్యార్థులతో కలసి పాఠం వింటున్న పిఒ



పిహెచ్‌సిలో వైద్యసేవలు పరిశీలిస్తున్న పిఒ స్మరణ్‌రాజ్

ప్రజాశక్తి-మారేడుమిల్లి: ఏజెన్సీలో పిహెచ్‌సిలకు వచ్చిన రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఆయా వ్యాధులకు ఉచిత మందులు అందజేయాలని రంపచోడవరం ఐటిడిఎ పిఒ స్మరణ్‌రాజ్ పేర్కొన్నారు. బుధవారం మారేడుమిల్లి పిహెచ్‌సిని, దేవరపల్లి గిరిజనసంక్షేమశాఖ బాలుర వసతి గృహాన్ని, దేవరపల్లిలోని రబ్బర్ ప్లాంటేషన్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిహెచ్‌సికి వచ్చిన రోగులకు రక్తనమూనాలు అవసరమైతే రక్తపరీక్షలు చేసి మందులు అందజేయాలన్నారు. సీజనల్ వ్యాధులకు సంబంధించి మందులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాల న్నారు. పిహెచ్‌సిలో సిబ్బంది ఎంతమంది ఉన్నదీ, ప్రతిరోజూ ఒపి ఎంతఉన్నదీ పరిశీలించారు. గర్భిణులు, బాలింతలు ఎంతమంది ఉన్నారు పరిశీలించారు. రోగులకు వైద్యసేవలు ఎలా అందుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. దేవరపల్లి గిరిజనసంక్షేమ ఆశ్రమపాఠశాలను పరిశీలించారు.నిబంధనల ప్రకారం మెనూ అమలు చేయాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని విద్యార్థులకు అందించాలన్నారు. అనంతరం రబ్బర్ ప్లాంటేషన్ పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ప్రాజెక్టు హార్టికల్చర్ అధికారి దేవదానం, సహాయక గిరిజన సంక్షేమ అధికారి శంబుడు, హెచ్ఎం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల సంస్మరణ సభను విజయవంతం చేయండి

ప్రజాశక్తి- విఆర్‌పురం: చింతూరులో 21వ తేదీన జరిగే అమరవీరుల సంస్మరణ సభను విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సోయం చిన్నబాబు పిలుపునిచ్చారు. విఆర్‌పురం మండలం ములకనపల్లి పంచా యతీ వీరపాపన్నకుంటలో బుధవారం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. సమావేశంలో మాట్లాడుతూ అమరవీరులు పోరాటాల ఫలితమే పేదప్రజలు, గిరిజనులు, సమస్యలపై పోడు భూములు పట్టాలు వైద్యం, విద్య రహదా రులు ,పోలవరం నిర్వాసితుల సమస్యలపై పోరాటాలు నడిపి ప్రభుత్వాలు పెట్టిన కేసుల్లో జైలు జీవితం గడిపారన్నారు. అమరవీరుల స్ఫూర్తితో ప్రతి కార్యకర్త పనిచేయాలన్నారు. కార్యక్రమం మండల కమిటీ సభ్యులు కమ్మ చిచ్చు సత్యనారాయణ, సుమన్ శేఖర్, భద్రయ్య రవ్వ దుర్గారావు, రవ్వ రామారావు, ఎంకమ్మ కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం, గుమ్మిరేవుల పంచాయతీలో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేశారని సర్పంచ్ మురళికమలమ్మ తెలిపారు. బుధవారం నుంచి వారంరోజుల పాటు గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ ఆధార్ సూపర్‌వైజర్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఆధార్ సేవలు అందిస్తారని పేర్కొన్నారు. ఆధార్‌లో మార్పులు చేర్పులు చేస్తారని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బ్యాక్ వాటర్‌తో పంటలకు నష్టం

ప్రజాశక్తి-విఆర్‌పురం: మండలంలోని చిన్నమట్టపల్లి పంచాయతీ చింతరేగుపల్లి గోనకొండ పొలాల్లోకి బ్యాంకు వాటర్ చేరింది. స్థానిక సర్పంచ్ పిట్ట రామారావు, ఎస్టీ సెల్ అధ్యక్షులు కాటంరాజు బుధవారం పరిశీలించారు. తదుపరి వారు మాట్లాడుతూ పోలవరం బ్యాక్ వాటర్ వల్ల గోదావరి నీరు పెరుగుతోందని దీంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని తక్షణమే ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలని గతంలో గోదావరి వల్ల పంటలు మునిగితే మళ్లీ తగ్గిన తర్వాత పంటలు వేస్తే మళ్లీ గోదావరి పెరిగి మిర్చి, పొగాకు, మినుము, పెసర వంటి పంటలకు నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేసారు. తక్షణమే పోలవరం బ్యాక్‌వాటర్ రాకుండా గేట్లు ఎత్తి నీటని దిగువకు వదలాలని నీటిపారుల శాఖ మంత్రి, కలెక్టర్, చింతూరు ఐటిడిఎ పిఒ తక్షణమే స్పందించి రైతులకి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గుటాల ముత్యాలరావు, గుటాల నవీన్‌కుమార్ పీసా కమిటీ సభ్యులు సోడి రామారావు, పాయం సత్యనారాయణ, రైతులు ముర్రం రాజులు తదితరులు పాల్గొన్నారు.



పొలాల్లోకి నీరు వచ్చిన దృశ్యం

రోడ్డు పనుల్లో బాధితులకు పరిహారం చెల్లించాలి



కాఫీ తోటలు కోల్పోయిన బాధితులు

ప్రజాశక్తి - కొయ్యూరు: నూతనంగా నిర్మిస్తున్న రోడ్డు పనుల్లో కాఫీ తోటలు నష్టపోతున్న తమకు నష్టపరిహారం చెల్లించాలని పలువురు కోరుతున్నారు. కొయ్యూరు మండలం బూదరాళ్ళ పంచాయతీ మూకుడుపల్లి నుండి కిండంగి గ్రామానికి నిర్మిస్తున్న రోడ్డు పనుల్లో కించే పొట్టిప డాల్, కించే సత్తిబాబు, కించె వలసయ్య, కించే బుజ్జి బాబు అనే రైతుల కాఫీ తోటలు నష్టపోతున్నారు. తమకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా రోడ్డు కాంట్రాక్టర్ సుమారు ఐదెకరాల భూమిని కాపుతో ఉన్న కాఫీ తోటలను జెసిబితో తొలగించారని వాపోయారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్, మండల పంచాయతీరాజ్ జెఇ కిరణ్‌కి కొయ్యూరు పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేసినట్లు రైతులు విలేకరుల సమావేశంలో తెలిపారు.

ఈ విషయమై జెఇ కిరణ్ స్పందిస్తూ ప్రస్తుతానికి రోడ్డు పనులు నిలిపేశామని ఇరువర్గాలు అంగీకరించిన తరువాత మళ్ళీ పనులు ప్రారంభిస్తామన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తమకు నష్టపరిహారం ఇప్పించి న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

గండిపోచమ్మతల్లికి ప్రత్యేక పూజలు

దేవీపట్నం- ప్రజాశక్తి : మాతృశ్రీ గండి పోచమ్మ తల్లి ఆలయం వద్ద పి.గొందూరు గ్రామస్తులు ఆలయ పాలకమండలి చైర్మన్ మాలుగుల శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం మరియు కూటమి ప్రభుత్వం గండి పోచమ్మ తల్లి అమ్మవారి ఆలయ అభివృద్ధికి కోట్లాది రూపాయలు విడుదల చేయడం జరిగిందన్నారు. కోట్లాది మంది భక్తుల మనోభావాలను గౌరవించినందుకు ప్రధానిమోడీ , ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ , జలవనరులు శాఖామాత్యులు నిమ్మల రామానాయుడు, దేవదాయ శాఖామాత్యులు ఆనం రామనారాయణ రెడ్డి పర్యాటక, సాంస్కతిక, సినిమాటోగ్రఫీ శాఖామాత్యులు కందుల దుర్గేష్ రంపచోడవరం నియోజక ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి, పోలవరం ప్రాజెక్ట్ ఇ ఎన్‌సి సిఈ నరసింహమూర్తికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు గోళ్ళ చంటి బాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పోలవరం ప్రాజెక్టుని శరవేగంతో పూర్తి చేస్తూ అమ్మవారి ఆలయానికి రెండు వందల ఏడు కోట్ల 58 లక్షలు మంజూరు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు.



పూజలు చేస్తున్న ఆలయ పాలకమండలి చైర్మన్ మాలుగుల శ్రీనివాసరెడ్డి

కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు మాగాపు బాబురావు, జనసేన పార్టీ మండల అధ్యక్షులు సారపురాయుడు, బిజెపి మండల అధ్యక్షులు కారం రామన్నదొర కూటమి నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యుత్ భద్రతా వారోత్సవాలు

ప్రజాశక్తి - చింతూరు: విద్యుత్ భద్రతా వారోత్సవాల్లో భాగంగా చింతూరు ఐటిడిఎ నుంచి చింతూరు సెంటర్ వరకూ విద్యుత్ ఉద్యోగులు, వినియోగదారులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాన్ని చింతూరు ఐటిడిఎ పిఒ శుభం నొక్వాల్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో రంపచోడవరం డిఇ వెంకటరమణ చింతూరు ఎడిఇ, ఎఇ విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం చింతూరు ఇపిడిసిఎల్ సబ్ డివిజన్ నందు సోలార్ పిఎం సూర్యఘర్ రూఫ్‌టాప్ కార్యక్రమంలో చింతూరు విద్యుత్ వినియోగదారులతో సోలార్ యొక్క ప్రాముఖ్యత సబ్సిడి, లోన్‌లు ఎలా తీసుకోవాలి అనేదానిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చింతూరు ఎస్‌బిఐ బ్యాంక్ మేనేజర్, యూనియన్ బ్యాంక్ మేనేజర్, సోలార్ వెన్డర్స్, చింతూరు ఎడిఇ ఎఇ గణేష విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.



దారకొండ ఘాట్‌రోడ్డులో చిరుత సంచారం



ప్రజాశక్తి - సీలేరు: జికె వీధి మండలం, సప్పర్ల దారకొండ ఘాట్‌రోడ్డు మధ్యలో బుధవారం సాయంత్రం 5:30 నిమిషాలకు చిరుత కనిపించడంతో ద్విచక్రవాహనంపై వస్తున్న వ్యక్తులు చూసి భయాందోళన చెందారు. సీలేరు పిహెచ్‌సిలో పనిచేస్తున్న ఫార్మసిస్ట్ సాయ, పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న మహేష్ కొద్దిరోజుల కిందట మాడుగుల వెళ్లారు. తిరుగు ప్రయాణంలో సీలేరు వస్తుండగా సప్పర్ల ఘాట్‌రోడ్డు రెయిన్‌గేజ్ ప్రధాన రహదారికి వచ్చేసరికి చిరుత కనిపించింది. అయితే అది వీరిని గమనించలేదు. సమీపంలోని అడవిలోకి రోడ్డు దాటి వెళ్లిపోయింది. దీంతో వీరు ఊపిరి పీల్చుకున్నారు. కొద్దిరోజుల కిందట పాడేరు వెళ్తున్న బస్సుకి పెద్దపులి తారసపడింది.

వ్యక్తి అదృశ్యం

ప్రజాశక్తి - సీలేరు: జికె వీధి మండలం సీలేరు పంచాయతీపరిధది మసీదు లైన్‌కి చెందిన వంతల బొల్లి ఈ నెల 16 వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు ఇంటి నుంచి వెళ్లారు. అప్పటి నుంచి కనిపించడం లేదు. కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

బాల్య వివాహాలను అరికట్టాలి


అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-హుకుంపేట: బాల్య వివాహాలను అరికట్టలని సిడిపిఒ సువర్ణమ్మ తెలిపారు. మండలంలోని గూడ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో బుధవారం బాల్య వివాహ ముక్తభారత్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని ఆమె అన్నారు. బాల్య వివాహాలు నిర్వహిస్తే రెండు సంవత్సరాలు జైలు శిక్ష, లక్ష రూపాయలు జరిమానా విధించడం జరుగుతుందని ఆమె అన్నారు.బాల్య వివాహాలు నివారణకు అందరు బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి, డిసిపిఒ కాంగుల సత్య, ఎల్ సి టి ఓ అశోక్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రుణ పరిమితిని పెంచాలి

ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ


సమీక్షిస్తున్న శ్రీపూజ

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలో వ్యవసాయ, వ్యవసాయేతర రంగానికి రుణ పరిమితి పెంచాలని అల్లూరి జిల్లా ఇన్చార్జ్ జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ బ్యాంకర్లకు సూచించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో లీడ్ బ్యాంకు ఆధ్వర్యంలో బ్యాంకర్లు, ప్రైమరీ సెక్టార్ (వ్యవసాయ, ఉద్యానవన, పశు సంవర్థక, ఫిషరీస్, పట్టు పరిశ్రమ, పరిశ్రమల శాఖలు) అధికారులతో ఆమె ప్రిలిమినరీ డీసీసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వ్యవసాయ, వ్యవసాయేతర రంగాలలో భాగంగా ఆర్ ఓ ఎఫ్ ఆర్ పట్టా కలిగి ఉన్న రైతులుకి రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలన్నారు. కౌలు రైతులకు, పశు సంవర్ధక, ఫిషరీస్ , పట్టు పరిశ్రమలకు కిసాన్ క్రెడిట్ కార్డ్ ద్వారా రుణాలు మంజూరు చేయాలని సూచించారు. జిల్లాలో ఉన్న రైతు సంఘాలు, ప్రాసెసింగ్ యూనిట్స్ పెంచి దానికి రుణ పరిమితి పెంచాల న్నారు. పరిశ్రమల శాఖకు సంబంధించి ముద్ర లోన్స్, తయారీ, సేవా రంగానికి కేంద్ర ప్రభుత్వ స్కీమ్స్ ద్వారా రుణాలు మంజూరు పెంచాలని సూచించారు.డీఆర్డిఏ ప్రాజెక్ట్ అధికారి మాట్లాడుతూ, జిల్లాలో స్వయం సహాయక సంఘాలకు డిజిటల్ ఎంసీపీ ద్వారా రుణాలు మంజూరు చేస్తామన్నారు. జిల్లాలో త్వరలో రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ సెంటర్స్ యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో అరకులో ప్రారంభం చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో ప్రతి నెలా రెండు దఫాలుగా స్వయం ఉపాధి ద్వారా వ్యాపారం ప్రారంభించడానికి ట్రైనింగ్ ఇస్తూ క్రెడిట్ లింకేజ్ రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ప్రీ డీసీసీ కన్వీనర్, యూనియన్ బ్యాంకు డిప్యూటీ రీజనల్ హెడ్ రాజా, లీడ్ బ్యాంకు మేనేజర్ మాతు నాయుడు, ఎస్బిఐ, ఏపీజీవీబీ, బ్యాంకు ఆఫ్ బరోడా అధికారులు, డీఆర్డీఏ పిడి మురళి పాల్గొన్నారు..

హాట్ బజార్ ప్రారంభం


ప్రారంభిస్తున్న దొన్నుదొర

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని సంతరి పంచాయతీ కొవ్వూరు గ్రామంలో ఏర్పాటు చేసిన హాట్ బజార్‌ను బుధవారం టీడీపీ అరకు నియోజకవర్గ ఇన్‌చార్జి, విజయనగరం జోనల్ చైర్మన్ సియ్యారి దొన్నుదొర ప్రారంభించారు. ఈ సందర్భంగా దొన్నుదొర మాట్లాడుతూ, హాట్ బజార్ ద్వారా గిరిజనులు స్థిరమైన ఆదాయ వనరులు ఏర్పడతాయన్నారు. గిరిజనులు తమ పంటలు, అటవీ ఉత్పత్తులు, హస్తకళ వస్తువులను మధ్యవర్తులు లేకుండా నేరుగా విక్రయించుకోవడంతో న్యాయమైన ధరలు లభిస్తాయన్నారు. కూరగాయలు, పండ్లు, ధాన్యాలు, నిత్యావసర వస్తువులు తక్కువ ధరలకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రభుత్వ పథకాలపై అవగాహన శిబిరాలు, సేవలు హాట్ బజార్ ద్వారా ప్రజలకు చేరువ చేయడం సులభమవుతుందన్నారు. స్థానిక ఉత్పత్తులకు నిరంతర మార్కెట్ ఏర్పడుతుందని, దగ్గరలోనే మార్కెట్ ఉండడంతో రవాణా ఖర్చులు, సమయం ఆదా అవుతాయని తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో హుకుంపేట మండల అధ్యక్షులు శతక బొంజుబాబు, ఏఎంసీ చైర్మన్ బోరిబోరి లక్ష్మీ, ఏఎంసి డైరెక్టర్ ఏడే చిట్టిబాబు, శోభకోట సర్పంచ్ శశిభూషణ్ నాయుడు, అందిభ సర్పంచ్ సత్యనారాయణ, తెలుగు రైతు మండల అధ్యక్షులు మాతె అప్పలకొండ, తెలుగు యువత మండల అధ్యక్షులు సిదరి లక్ష్మణ్ రావు, ఐటీడీపీ అరకు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, క్లస్టర్ ఇన్‌చార్జ్ నూకరాజు, మత్స్యరాజు, పాడి సుమన్, ఎస్టీ సెల్ ఉపాధ్యక్షులు పలసీ అప్పారావు పాల్గొన్నారు.

వైఎస్ షర్మిల జన్మదిన వేడుకలు


చింతపల్లిలో కేక్ కట్ చేస్తున్న నేతలు

ప్రజాశక్తి - అరకులోయరూరల్: ఎపిసిసి రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలమ్మ జన్మదిన వేడుకలు బుధవారం అరకులోయ మండలం గన్నెల గ్రామంలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాచిపెంట శాంతకుమారి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కానూరి ప్రవీణ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మొస్య ప్రేమ్ కుమార్, కిశాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పాంగి గంగాధర్, గిరిజన విభాగం జిల్లా కోఆర్డినేటర్ తెలగంజి సోమేశ్వరరావు, కిసాన్ సెల్ మండల ఉపాధ్యక్షుడు చిట్టం నాయక్ బలబద్దర్, పూజారి దామోదర్ పాల్గొన్నారు.

చింతపల్లి : ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల జన్మదిన వేడుకలు చింతపల్లిలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర చైర్మన్ రీమల నవభారత్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు శతక బుల్లిబాబు, పార్టీ అధికార ప్రతినిధి కంకిపాటి బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు సాగిన వీరన్న పాడాల్, జిల్లా కార్యదర్శి లకే రమణ, చింతపల్లి మండల అధ్యక్షుడు గెమ్మెలి రామచందర్, పాడేరు మండల అధ్యక్షుడు బాబు రావు, జి.మాడుగుల మండల అధ్యక్షుడు చిన్నచారి, జిల్లా కార్యదర్శి ఉల్లి వెంకట రమణతో పాటు యువ నాయకుడు నాగేష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

చింతలూరును ప్రత్యేక పంచాయతీగా ప్రకటించాలి


వినతిపత్రాన్ని ఇస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి-చింతపల్లి : చింతపల్లి మండలంలోని పెదబరడ పంచాయతీ పరిధిలో ఉన్న చింతలూరు గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక కూటమి నాయకులు, గిరిజన గ్రామాల ప్రజలు ఎంపీడీవో సీతామహాలక్ష్మికి బుధవారం వనతిపత్రం అందజేశారు. 10 గ్రామాల ప్రజలు తీర్మానం చేసిన పత్రాన్ని సమర్పించారు. ప్రస్తుతం పెదబరడ పంచాయతీ పరిధిలో ఉన్న చింతలూరును విడదీసి, పరిసర ప్రాంతాల అభివృద్ధి ధ్యేయంగా కొత్త పంచాయతీని ఏర్పాటు చేయాలని వారు కోరారు. పెదబరడ పంచాయతీ కేంద్రం చింతలూరు పరిసర గ్రామాలకు సుమారు 12 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో పాలన ప్రజలకు భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. సచివాలయ సేవలు పొందాలన్నా, ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలన్నా, చిన్నపాటి ధ్రువపత్రాలు కావాలన్నా గిరిజనులు కిలోమీటర్ల మేర ప్రయాణించాల్సి వస్తోందని వివరించారు. ఇంత శ్రమకోర్చి వెళ్లినా, సకాలంలో అధికారులు అందుబాటులో లేక పనులు పూర్తికావడం లేదని, దీనివల్ల కూలి పనులు మానుకొని కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని గ్రామస్తులు వాపోయారు. జనాభా ప్రాతిపదికన, భౌగోళిక విస్తీర్ణం పరంగా చింతలూరుకు ప్రత్యేక పంచాయతీగా ఏర్పడేందుకు అన్ని అర్హతలు ఉన్నాయని నాయకులు గుర్తుచేశారు. చింతలూరుతో పాటు కృష్ణాపురం, వంగసార అనే మూడు రెవెన్యూ గ్రామాలను కలుపుతూ పెద్దగడ్డ, కోమల బంద, నక్కల మెట్ట, గున్న మామిడి, నరహరి వీధి, లోతుగడ్డ జంక్షన్, చిన్న కృష్ణాపురం తదితర 10 గ్రామాలకు చింతలూరును కేంద్రంగా చేయాలని ప్రతిపాదించారు. సుమారు 1000 మంది గ్రామస్తుల సంతకాలు చేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు సుర్ల వీరేంద్ర కుమార్, కూడ రామకృష్ణ, టీడీపీ సీనియర్ నాయకులు గెమ్మెలి మహేష్, పీసా కమిటీ ప్రతినిధులు భగత్ రాం, సురేష్, లక్ష్మణరావు, హరిబాబు, వెంకటరమణ, ఆనంద్ కుమార్, గ్రామస్తులు సతీష్, రామరాజు, దాసు, రాము, శివ సాయిబాబు పాల్గొన్నారు.

సమగ్రంగా సర్వే చేయాలి

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండల ప్రజా పరిషత్ మీటింగ్ హాల్‌లో సచివాలయ సిబ్బందికి సమీకృత కుటుంబ సర్వేపై శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ సన్యాసిరావు పాల్గొని సర్వే ఉద్దేశ్యం, భవిష్యత్ ఉపయోగాలపై వివరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపీడీఓ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందించే అన్ని సంక్షేమ పథకాలు అర్హులైన వారికే చేరేలా చేయడమే లక్ష్యంగా సమీకృత కుటుంబ సర్వేను చేపట్టిందని తెలిపారు. ఇప్పటివరకు వివిధ శాఖల ద్వారా విడివిడిగా ఉన్న కుటుంబ సమాచారాన్ని ఒకే సర్వేలో నమోదు చేయడం ఈ పథకం ప్రధాన ఉద్దేశమన్నారు. ఈ సర్వేలో ప్రతి కుటుంబానికి సంబంధించిన కుటుంబ సభ్యుల సంఖ్య, ఆధార్ వివరాలు, విద్య, వృత్తి, ఆదాయం, భూమి, ఇల్లు, రేషన్ కార్డు, పెన్షన్, ఇతర ప్రభుత్వ పథకాల లబ్ధి, ఆరోగ్య, సామాజిక స్థితి వంటి సమగ్ర సమాచారాన్ని నమోదు చేస్తారని వివరించారు. ఈ డేటా ఆధారంగా ప్రభుత్వం భవిష్యత్తులో సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. సమీకృత కుటుంబ సర్వే పూర్తయిన తర్వాత ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ బెనిఫిట్ కార్డు జారీ చేయడం జరుగుతుందని డిప్యూటీ ఎంపీడీఓ తెలిపారు. భవిష్యత్తులో ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసే సమయంలో ఈ కార్డే ప్రధాన ఆధారంగా ఉపయోగ పడుతుందన్నారు. సర్వే నిర్వహించేందుకు ఇంటింటికి వచ్చే సచివాలయ సిబ్బందికి ప్రజలందరూ పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీకి ట్రాక్టర్


ట్రాక్టర్‌ను ఇస్తున్న అధికారులు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు : మండల కేంద్రం లోనీ కించాయి పుట్టు గ్రామ పంచాయతీ సచివాలయం పరిధిలోని పారిశుద్ధ్య కార్యక్రమాలకు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ద్వారా ట్రాక్టర్ను పంపిణీ చేసినట్లు మండల అభివృద్ధి శాఖ అధికారి కే ధర్మారావు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండల కేంద్రంలో అత్యధికంగా చెత్త నిలువ ఉండటంతో దుర్గంధం వెదజల్లుతోందని, ఈ కారణంగా ప్రభుత్వానికి ట్రాక్టర్ ట్రాలర్ సరఫరా చేయాలని కోరగా స్వచ్ఛంద కార్పొరేషన్ ద్వారా అందించారని తెలిపారు. దుకాణ నిర్వాహకులు దుకాణం సమీపంలో చెత్తబుట్టలు ఏర్పాట్లు చేసుకోవాలని, వ్యర్థాలను చెత్తబుట్టలో వేసి పారిశుద్ధ్య కార్మికులకు సహకరించాలని కోరారు. ప్లాస్టిక్ కవర్లను విక్రయించడం, వినియోగించడం స్వచ్ఛందంగా విరమించుకోవాలని ఆయన కోరారు.

'చట్టాల అమల్లో విఫలం'

ప్రజాశక్తి-జిమాడుగుల: రాజ్యాధికారం ఆదివాసులకు అప్పగించాలని భారత రాజ్యాంగంలో రాజ్యాంగం 5వ షెడ్యూల్ స్పష్టం చేస్తుందని దండకారణ్య ఉద్యోగ సమితి జాతీయ కార్యదర్శి సమరెడ్డి మాణిక్యం అన్నారు. బుధవారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం వచ్చి సుమారు 80 సంతాలకు చేరువైనప్పటికి ఎలాంటి అభివృద్ధికి నోచుకోక తీవ్రమైన దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. ఆదివాసీ హక్కులు, చట్టాలు భారత పాలకులు అమలు చేయటంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫల మయ్యాయన్నారు. స్వయంపాలన అధికారం అప్పగించాలని దండకారణ్య విమోచన సమితి సలహా దారులు, దండకారణ్య ఉద్యోగ సమితి జాతీయ కార్యదర్శి సమరెడ్డి మాణిక్యం డిమాండ్ చేసారు. ఆదివాసి రాజకీయ ప్రతినిధులు స్వయపాలన ఉద్యమాలకు ప్రజలను సిద్ధం చేయాలనీ దండకారణ్య ఉద్యోగ సమితి జాతీయ కార్యదర్శి సమరెడ్డి మాణిక్యం కోరారు.

ఆటో, బైకు ఢీ :ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండల కేంద్రానికి సమీపంలోని ఏకలవ్య పాఠశాలకు ఎదురుగా జాతీయ రహదారిలో బుధవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. కించుమండ సంత నుంచి దుంబ్రిగుడవైపు వస్తున్న ఆటో, దుంబ్రిగుడ నుంచి కించుమండకు వెళ్తున్న స్కూటీ ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ఘటనలో చంపాపట్టి గ్రామానికి చెందిన ముగ్గురు యువకులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు దుంబ్రిగుడ పీహెచ్‌సికు తరలించారు.

నేషనల్ మ్యాథ్స్ ఒలింపియాడ్‌కు జశ్వంత్

ప్రజాశక్తి-ఆనందపురం: మ్యాథమెటిక్స్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన రీజినల్ మాథ్స్ ఒలింపియాడ్ 2వ స్థాయి పరీక్షల్లో కెకెఆర్. గౌతమ్ హైస్కూల్ టెన్త్ విద్యార్థి బండారు జశ్వంత్ విశేష ప్రతిభను కనబర్చి ఇండియన్ నేషనల్ మాథ్స్ ఒలింపియాడ్ మూడవ స్థాయికి అర్హత సాధించాడని పాఠశాల డీన్ శేషుబాబు తెలిపారు. ఈ సందర్భంగా జశ్వంత్‌ను మ్యాథ్స్ హెచ్ఒడ కెవిఆర్. మూర్తి, కళాశాల ప్రిన్సిపాల్ కెవిఆర్, కెమిస్ట్రీ హెచ్ఒడి. వేణుగోపాల్ అభినందించారు. విద్యార్థి నిరంతర కృషి, ఉపాధ్యాయుల సమర్థ మార్గనిర్దేశం, తల్లిదండ్రుల సహకారంతోనే ఈ ఘన విజయం సాధ్యమైందనితెలిపారు. జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు

ఐక్య క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-ముంచింగి పుట్టు: మండల కేంద్రంలో లెమన్స్ ఇవాంజీ కల్ ఫిలోషిఫ్ చర్చిలో బుధవారం పాస్టర్ చెండా అబ్రహం ఆధ్వర్యంలో ఐక్య క్రిస్మస్ ఆరాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ చెండా అబ్రహం యేసుక్రీస్తు పుట్టుక విధానంపై వాక్యోపదేశం చేశారు. ఏసుక్రీస్తు ప్రభువు మానవాళి పాపాలు విమో చించడానికి కన్య మరియమ్మ గర్భంలో మానవ రూపంలో ఈ లోకానికి వచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో సేవకులు సిహెచ్ మనోహరమ్మ, జాన్, తిమోతి, బ్రాయినార్డ్, సమూయేలు, బర్నభ , విలియం కేరి పాల్గొన్నారు.


శిక్షణ ఇస్తున్న ఎంపిడిఒ రవికిషోర్

సచివాలయ సిబ్బందికి ఫ్యామిలీ సర్వే శిక్షణ

ప్రజాశక్తి - మారేడుమిల్లి: మండలంలోని ఎంపిడిఒ కార్యాలయం లో బుధవారం గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే శిక్షణ నిర్వహించారు. ప్రజల నుంచి సమగ్ర కుటుంబ,ఆర్థిక, సామాజిక విద్యా ఉద్యోగ సంబంధ సమాచారం సేకరించే విధంగా సర్వేను రూపకల్పన చేశారని ఎంపిడిఒ రవికిషోర్ తెలిపారు. నెలరోజులు ఈ సర్వే నిర్వహిస్తామన్నారు. ఈ సర్వేను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి లలితాకుమారి తెలిపారు. మండల ప్రజాపరిషత్ పరిపాలనాధికారి రత్నకుమారి పాల్గొన్నారు.

బిఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ సేవలు విస్తృతం చేస్తాం


విలేకరులతో మాట్లాడుతున్న డిఇ శ్రీనివాసరావు

ప్రజాశక్తి - సీలేరు: అల్లూరి సీతారామరాజు జిల్లాలో బిఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ సేవలను విస్తృతం చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని డిఇ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ బిఎస్ఎన్ఎల్ స్నిగ్నల్స్, ఒఎఫ్‌సి ద్వారా ఇంటర్‌నెట్ సేవలు మెరుగుపర్చేందుకు మాన్ అనే కొత్తపరికరాల ద్వారా ఆధునీకరణ చర్యలు చేపడుతున్నామన్నారు. నర్సీపట్నం, చింతపల్లి గూడెం సీలేరు మధ్యలో ఒఎఫ్‌సి కేబుల్ తెగిపోయినా ఆయా ప్రాంతాల్లో కరెంట్ పోయినా వెంకటనే డొంకరాయి మీదుగా రాజమండ్రి ఒఎఫ్‌సి కేబుల్‌కు అనుసంధానమై స్నిగ్నల్స్‌కు అంతరాయం లేకుండా ఉంటుందన్నారు. సీలేరు పరిసర ప్రాంతాల్లో 16 టవర్లు ప్రస్తుతం ఏర్పాటు చేసి సేవలు విస్తృతం చేసేందుకు చర్యలు వేగవం తం చేస్తున్నామన్నారు. ప్రభుత్వం ఉద్యమి అనే కొత్త ఆఫర్ ద్వారా ప్రభుత్వ పాఠశా లలు, ఆస్పత్రులకు, బిఎస్ఎన్ఎల్ ఇంటర్నెట్ కనెక్షన్లు వేస్తామని దీనికి అయ్యే ఖర్చు నెలలో వచ్చే బిల్లును మాత్రమే భరిస్తుందని డిఇ శ్రీనివాసరావు తెలి పారు. జికె వీధి మండలం గాలికొండ పంచాయతీ పరిధి సప్పర్లలో ఆధునీకరి స్తామని త్వర లోనే పూర్తి స్థాయిలో ప్రజలకు అందించేలా చర్యలు తీసుకుంటా మన్నారు. కార్యక్రమంలో జెటిఒ ఇన్‌చార్జి ప్రవీణ్, బిఎస్ఎన్ఎల్ ఆపరేటర్ శివకుమార్ తదిదతరులు పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రిలో ఆర్థోవైద్యుని నియామకం


డాక్టర్ తేజ్‌నారాయణను సత్కరిస్తున్న సిపిఐ మండల మాజీ కార్యదర్శి సత్తిబాబు

ప్రజాశక్తి - జికె వీధి: స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఆర్థో వైద్యునిగా డాక్టర్ తేజ్‌నారాయణ బాధ్యత లు స్వీకరించారు. సిపిఐ సీనియర్ నాయకుడు, జికె వీధి మండల మాజీ కార్యదర్శి కంకిపాటి సత్తిబాబు, మండలా నికి చెందిన వైసిపి నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా వైద్యాధికారి తేజ్ నారాయణకు పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతపల్లి, జికె వీధి మండలాల ప్రజలకు ఆసరాగా ఉన్న చింతపల్లి ప్రాంతీయ ఆసుపత్రిలో ఆర్థోపెడిక్ వైద్యులు నియామకం కావడం సంతోషకరమన్నారు. ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించ వలసిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వైసీపి రింతాడ పంచాయతీ అధ్యక్షులు సోబోయి రామ్మూర్తి, జికె వీధి మండల వైసిపి ప్రధాన కార్యదర్శి పాంగి చందు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ సూర్యనారాయణ


అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

ప్రజాశక్తి-కూనవరం: అగ్ని ప్రమాదాలపై బుధవారం కూనవరం మండలం కోతుల గుట్ట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్య సిబ్బందికి కూనవరం ఫైర్ స్టేషన్ సిబ్బంది అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కూనవరం అగ్ని ప్రమాద కేంద్రం అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ సూర్యనారాయణ మాట్లాడుతూ ఆకస్మికంగా సంభవించే ప్రమాదాలు పట్ల అప్రమత్తంగా ఉండి ప్రమాదాలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు.
అగ్ని ప్రమాదాలు జరిగే సమయంలో మనం ఎలా స్పందించి మంటలను ఆర్పాలనే విషయం తెలుసుకోవాలన్నారు. ముఖ్యంగా విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వంటి ప్రమాదాలు గమనించి వాటిని నివారించే విధంగా చూడాలన్నారు. ఆసుపత్రుల్లో అగ్నిప్రమాద నివారణకు సంబంధించిన అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో కోనవరం ఫైర్ స్టేషన్ లీడింగ్ ఫైర్‌మాన్ రాంబాబు, సిహెచ్ రమేష్‌బాబు, కూనవరం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి తేజ, వైద్య సిబ్బంది తుష్టి జోగారావు ప్రసాద్, జీవన్ ఎం. దుర్గమ్మ, రవితేజ, తులసి, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

పంప్డ స్టోరేజీ ప్రాజెక్టు నిర్వాసితులకు న్యాయం చేస్తాం

- తహశీల్దార్ అన్నాజీరావు


పార్వతీనగర్‌లో తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న పివిటిజిలు

ప్రజాశక్తి -సీలేరు: ఆర్థిక సామాజిక పరిస్థితులపై అధ్యయనం చేసి పంప్డ స్టోరేజ్ ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు ఇల్లు, స్థలం, ఆర్థిక పరిహారం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా అందజేస్తామని జికె వీధి తహశీల్దార్ అన్నాజీరావు స్పష్టం చేశారు. బుధవారం పంప్డ స్టోరేజ్ ప్రాజెక్టు నిర్వాసిత గ్రామాలైన దుప్పలివాడ పంచాయతీ శాండికోరి, బూసికొండ, సీలేరు పంచాయతీ పార్వతీనగర్‌లో విడివిడిగా సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ అన్నాజీరావు మాట్లాడుతూ కలెక్టర్ దినేష్‌కుమార్ తనకు ఎంపిడిఒను ఇన్‌చార్జిగా నియమించారని ఆయన ఆదేశాల మేరకు బుధవారం సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. ఎపి జెన్‌కో స్థలంలో పార్వతీనగర్ పివిటిజిలు ఉన్నప్పటికీ ఎన్నో ఏళ్లగా నివాసాలు ఏర్పాటు చేసుకుని ఉన్నారు కనుక అర్హులకు న్యాయం చేసేలా సర్వే నిర్వహించి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. కుటుంబంలో యజమానితో పాటు 18 సంవత్సరాలు దాటిన కుటుంబ సభ్యుల వివరాలు తెలపాలని, రెవెన్యూ సిబ్బంది రెండు రోజుల్లోగా వచ్చి సర్వే చేస్తారని ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలో అర్హులను అర్హతను బట్టి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. పంప్డ స్టోరేజ్ ప్రాజెక్టు నిర్మాణానికి ప్రతి సహకరించాలని కోరారు. ఇప్పటికే ప్రాజెక్టుకు అటవీ, పర్యావరణ అనుమతులు వచ్చాయని పేర్కొన్నారు. అనంతరం మూడు గ్రామాలకు చెందిన నిర్వాసితులు డిమాండ్లతో కూడిన వినతిపత్రం తహశీల్దార్ అన్నాజీరావుకు అందజేశారు.

సీలేరుకు నష్టం కలిగితే నష్ట నివారణ చర్యలు చేపట్టాలి

పంప్డ స్టోరేజ్ ప్రాజెక్టు వలన సీలేరు ప్రజలకు నష్టం కలిగితే నష్ట నివారణ చర్యలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ అన్నాజీరావుకు సర్పంచ్ దుర్జో, డిసిసి కార్యదర్శి కారే శ్రీనివాస్ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఆయన సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ఎపి జెన్కో పంప్డ స్టోరేజ్ ప్రాజెక్టు ఎస్ఇ సివిల్ హనుమ, ఇఇ భాస్కర్‌రావు, ఎడిఇ అప్పలనాయుడు రెవెన్యూ సిబ్బంది మూడు గ్రామాల పెద్దలు బిఎం రావు, ప్రభాస్, శ్రీను, ఉపసర్పంచ్ వల్లి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల పునర్విభజనకు గ్రామసభ

ప్రజాశక్తి -కొయ్యూరు: మండలంలోని బూదరాళ్ల పంచాయతీ సచివాలయంలో పంచాయతీల పునర్విభజనలో భాగంగా బుధవారం స్థానిక సర్పంచ్ సాగిన ముత్యాలమ్మ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ పునర్విభజన ద్వారా గ్రామస్తులకు పరిపాలన సౌలభ్యం, సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. ప్రస్తుతం పంచాయతీ కేంద్రానికి చేరుకోవాలంటే సుమారు 40 కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తోందని దీంతో సమయం, డబ్బు వృథా అవుతోందన్నారు. పునర్విభజన చేస్తే ఇబ్బంది తొలగుతుందన్నారు. బూదరాళ్లతో పాటు బాలరేవుల, గరిమండ గ్రామాలను పంచాయతీ కేంద్రాలుగా ఏర్పాటు చేసేందుకు వార్డు సభ్యులు, పీసా కమిటీ సభ్యులు, గ్రామస్తుల ఆమోదంతో ఏకగ్రీవంగా తీర్మానించామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ లీలాకృష్ణ, ఎంపిటిసి సభ్యులు, వార్డు సభ్యలు తదితరులు పాల్గొన్నారు.

సూర్యఘర్‌పై అవగాహన


సోలార్‌ఘర్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి- చింతూరు: ఇపిడిసిఎల్ సబ్ డివిజన్ నందు సోలార్ పిఎం సూర్యఘర్ రూఫ్ టాప్ కార్యక్రమంపై బుధవారం యర్రంపేటలో అవగాహన సదస్సు నిర్వహించారు. చింతూరు విద్యుత్ వినియోగ దారులతో సోలార్ ప్రాముఖ్య త సబ్సిడీ లోన్‌లు ఎలా తీసుకోవాలి అనే అంశంపై అవగాహన కార్యక్రమంను రంపచోడవరం డిఇ నేరుగా బ్యాంకు మేనేజర్లతో వినియోగదారులకు ముఖాముఖి కార్యక్రమం ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చింతూరు ఎస్‌బిఐ బ్యాంక్ మేనేజర్, యూనియన్ బ్యాంకు మేనేజర్, సోలార్ వెన్డర్స్, చింతూరు ఎడిఇ గణేష్ విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

సిపిఎం కార్యకర్త జగన్నాథం మృతి

ప్రజాశక్తి-విఆర్‌పురం: మండలంలోని రామవరం పంచాయతీ అడవివెంకన్నగూడెం శాఖ సిపిఎం సభ్యులు, యువ కార్యకర్త కారం జగన్నాథం (జగన్,) కిడ్నీ వ్యాధితో బాధపడుతూ బుధవారం మృతి చెందారు. ఆయన పార్థివ దేహానికి ఎఎస్ఆర్ రంపచోడవరం సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, జిల్లా నాయకులు సున్నం రాజులు, సోయం చినబాబు, సీనియర్ నాయకులు కుంజ నాగిరెడ్డి, పార్టీ మండల కార్యదర్శి పులి సంతోష్‌కుమార్, ఎంపిపి కారం లక్ష్మి, పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. జగన్నాథం కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడని కార్యకర్తగా ప్రజా సమస్య లపై పోరాడేవాడని ఉద్యమాల్లో పాల్గొనేవాడని ఆయన స్ఫూర్తిగా తీసుకొని ప్రతి కార్యకర్త పని చేయాలని పిలుపునిచ్చారు. మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


చెన్నుపాటి లక్ష్మయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

'అమరవీరుల స్ఫూర్తితో పోరాటం చేయాలి'

ప్రజాశక్తి - విఆర్‌పురం: ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాతలైన అమరజీవులు చెన్నుపాటి లక్ష్మయ్య, షేక్ సాబ్జి వర్ధంతి సందర్భంగా యుటిఎఫ్ మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కె.వెంకట్ అధ్యక్షతన వర్ధంతి సభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యుటిఫ్ జిల్లా కార్యదర్శి, మండల కార్యదర్శి ఎస్.నాగేశ్వరరావు, ఎన్. జగదిష్ మాట్లాడుతూ అమరజీవుల స్ఫూర్తితో సమరశీల పోరాటాల్లో పాల్గొనాలని పిలుపు నిచ్చారు.ప్రతి యూటిఎఫ్ కార్యకర్త పోరాటాల్లో పాల్గొని ఉద్యమాలను విజవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎన్.రామకృష్ణ, ఎం.బాబు, ఎ. రాము, ఎన్.కామేష్, మణిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గంగవరం: మండలంలోని గొరగొమ్మి రహదారిలో డిఎఫ్ఎల్ (చాపల బస్సు) ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. గొరగొమ్మి నుంచి జగ్గంపేట వెళ్తున్న బస్సు గార్లపాడు నుంచి గొరగొమ్మి వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ద్విచక్రవాహనంపై ఇద్దరు వ్యక్తులు ఉన్నారు. వెనుక కూర్చున్న గొరగమ్మి గ్రామానికి చెందిన జెట్టి సత్యనారాయణ (36) అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ వెంకటేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

41.5 కాంటూరు లెక్కల ప్రకారం పరిహారం ఇవ్వాలి

ప్రజాశక్తి-కూనవరం: 41.5 కాంటూరు లెక్కల ప్రకారం నిర్వాసితులకు ప్యాకేజి ఇవ్వాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు, మాజీ సర్పంచ్ పాయం సీతారామయ్య ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు అధికారులను 41.5 లో ఉన్నప్పుడు మాకు ఎందుకు ప్యాకేజీ ఇవ్వడం లేదని అడిగితే పాత సర్వే ప్రకారం 45.48 కాంటూరులో ఉన్నారం టున్నారు. 2022 వరదల్లో 38 కాంటూరు లెవెల్లో అధికస్థాయిలో వరద వచ్చిందని, 41.5 కాంటూరు పూర్తయితే ఎంతస్థాయిలో వస్తుందని ఇప్పటికైనా అధికారు లు, ప్రజాప్రతినిధులు స్పందించి నిర్వాసితులకు న్యాయం చేయాలన్నారు.